పెరిగిన యాదగిరీశుడి ఆదాయం

- రూ.30.62 కోట్లు అధిక వార్షికాదాయం
- రూ.18.62 కోట్లు అధిక వాస్తవాదాయం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక ఆదాయం గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పెరిగింది. ఈ సంవత్సరం రూ.30.62 కోట్లు అధికంగా వార్షిక ఆదాయం(దేవస్థానం ఆస్తుల అడ్వాన్సులు, బాండ్లు కలిపి), వాస్తవ ఆదాయం రూ.18.62 కోట్లు వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు స్వామి వారి వార్షిక ఆదాయం రూ.224కోట్ల 25లక్షల 87వేల 229 రాగా వార్షిక వ్యయం రూ.214కోట్ల 55లక్షల 85వేల 249 ఉంది. 9.70 కోట్లు మాత్రమే మిగిలింది. 2022-23 వార్షిక ఆదాయం 193కోట్ల 62లక్షల 92వేల 970 రూపాయలు రాగా, వార్షిక వ్యయం రూ.186కోట్ల 97లక్షల 71వేల 670 వచ్చింది. ఈ ఏడాది వాస్తవ ఆదాయం రూ.151.00 కోట్లు, వాస్తవ వ్యయం రూ.119.53 కోట్లు రాగా.. స్వామి వారికి రూ.31.46 కోట్లు మిగిలింది. గతేడాదితో పోలిస్తే ఈసారి వాస్తవ ఆదాయం రూ.18.62 కోట్లు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సర వార్షిక ఆదాయ, వ్యయ వివరాలను దేవస్థానం సోమవారం విడుదల చేసింది. గతేడాదితో పోలిస్తే ఈసారి వార్షిక ఆదాయం అధికంగా బ్రేక్ దర్శనాలు, హుండీలు, ప్రసాద విక్రయాలతో సమకూరిందని తెలిపారు. బ్రేక్ దర్శనాల ద్వారా రూ.7.62 కోట్లు, హుండీల ద్వారా రూ.32.26 కోట్లు, ప్రసాద విక్రయాలతో రూ.41.04 కోట్లు, ఆర్జిత సేవలు రూ.10.46 కోట్లు, తలనీలాలు రూ. 3.88 కోట్లు, ఇతర విభాగాల ద్వారా రూ.110.17 కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. వ్యయాలను సిబ్బంది వేతనాలు, పెన్షన్స్ ఫండ్ కింద రూ.20 కోట్లతోపాటు నూతన ఎఫ్‌డీఆర్ ఖరీదు చేశారు. ప్రభుత్వానికి చెల్లింపు పన్నుల కింద రూ.20.72 కోట్లు, ఎలక్ట్రికల్ అండ్ నీటి నిర్వహణకు రూ.3.91 కోట్లు, భక్తుల వసతుల కల్పనతోపాటు ఆర్టీసీ నిర్వహణకు రూ.10.63 కోట్లను ఖర్చు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ 68 షాపుల లీజులు, ఇతర లైసెన్స్‌ల టెండర్లతో 55 టెండర్లు ఆమోదించగా, రూ.9.36 కోట్లు సమకూరాయి. మరో 13 లీజులు, లైసెన్సులకు టెండర్లను త్వరలో ఆహ్వానించనున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్ రావు వెల్లడించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు జూన్ 5 కల్లా పూర్తి చేయాలి

576 పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి: సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

పిల్లలమర్రి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 15 : జిల్లాలోని 584 అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు జూన్ 5 కల్లా పూర్తి చేయాలని సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. సూర్యాపేట పట్టణ పరిధి బాషా నాయక్‌తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను సోమవారం కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని గుర్తించబడిన 584 ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం వసతుల కల్పన కోసం తాగునీరు, విద్యుత్, బాలికల టాయిలెట్స్ సుందరీకరణ పనులు చేపట్టిందని తెలిపారు. 576 పాఠశాలలో కమిటీలు ఏర్పాటు చేశామని, 555 పాఠశాలల కమిటీలు బ్యాంకు ఖాతాలను ప్రారంభించాయని, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం పిల్లలమర్రి గ్రామంలో పీఏసీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లను చూసి ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తేమ శాతం యంత్రం ద్వారా రైతులు తెచ్చిన ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులు ఆరబెట్టుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న రైతులు ఐరిష్ వల్ల చాలా ఇబ్బందులు గురవుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ ప్రసాద్, పీఏసీఎస్ అధికారులు వెంకట్ రెడ్డి, వెంకటేశ్, సిబ్బంది ఉన్నారు.

ప్రపంచ విజ్ఞాన కవి అంబేద్కర్

- ఓయూ ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరెడ్డి



సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న సంఘమిత్ర ఎడ్యుకేషనల్ సొసైటీ అండ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 15 : ప్రపంచ విజ్ఞాన కవి అయిన అంబేద్కర్ మన దేశంలో పుట్టడం మనందరికీ గర్వకారణమని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆరుట్ల జానకిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకుడు బోడ వజ్రయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కుడకుడలో సంఘమిత్ర ఎడ్యుకేషనల్ సొసైటీ అండ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు, న్యాయవాది తలమల్ల హుసేన్ అధ్యక్షతన అంబేద్కర్ జయంతిని ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి పేద కుటుంబంలో పుట్టిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రపంచ దేశాల్లో అత్యుత్తమ చదువులు చదివి తన జన్మదినాన్ని ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకొనేందుకు ఐక్యరాజ్య సమితి నిర్ణయించే స్థాయికి ఎదిగారన్నారు. ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వమున్న అన్ని దేశాలు అనేక చర్చలు, సమావేశాలు జరిపి అంబేద్కర్ జన్మదినాన్ని ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకోవాలని 2016లో నిర్ణయం తీసుకున్నాయని తెలిపారు. అనంతరం అంబేద్కర్ అనుయాయులు, సీనియర్ సిటిజన్స్‌కు నూతన వస్త్రాలు, అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించి సన్మానించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంరెడ్డి, సీనియర్ న్యాయవాది గొండ్రాల అశోక్, ప్రజాసంఘాల నాయకులు పాండునాయక్, గోపయ్య, రమణాచారి, దయానంద్, రాజారావు, పుల్లయ్య, సాంబయ్య, అశోక్, అఖిల్, దేవయ్య, కె.ఆనందరావు, చార్లెస్ కీర్తి, కళ్యాణ్, వెంకటరత్నం, వెంకటనర్సయ్య, బక్కయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రశాంతి

చిలుకూరు, ఏప్రిల్ 15 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ బండ్ల ప్రశాంతి, జడ్పీటీసీ బొలిశెట్టి శిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. మంచినీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, అవసరం ఉన్నచోట పైపుల ద్వారా నీటిని సరఫరా చేయాలని అన్నారు. మిషన్ భగీరథ నీటిని గ్రామాల్లోని ట్యాంకుల్లో నింపి నల్లాల ద్వారా ఇంటింటికీ ఇవ్వాలని సూచించారు. అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు జానీ మియా, తాసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డి, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలి

- ఆర్ఎంఎస్ఏ జేడీ సరోజిని

గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఆర్ఎంఎస్ఏ జేడీ సరోజిని

గరిడేపల్లి, ఏప్రిల్ 15 : విద్యార్థుల సమగ్రాభివృద్ధిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) జాయింట్ డైరెక్టర్ సరోజిని అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో సోమవారం సమ్మెటివ్ అసెస్‌మెంట్- 2 పరీక్షల నిర్వహణ, పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయుటకు ఉపాధ్యాయులు అనుసరిస్తున్న పద్ధతుల గురించి అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్‌తో కలిసి విద్యార్థులను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందించేందుకు సరైన బోధనా పద్ధతులను అనుసరించడమే కాకుండా తగిన బోధనోపకరణాలను ఉపయోగిస్తూ బోధించాలన్నారు. అప్పుడే విద్యార్థులు అనుకున్న స్థాయిలో విషయ అవగాహన చేసుకోగలుగుతారని తెలిపారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మసులుతూ వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు పాటించవలసిన అకడమిక్ స్థాయిలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థులను ప్రోత్సహించేందుకు అనుసరిస్తున్న విధానాలు, సానుకూల వాతావరణ పరిస్థితుల్లో విద్యను అందించేందుకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు. వారి వెంట పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి, ఎంఈఓ పి.చత్రునాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీజేపీ ఏం చేసిందని రైతు దీక్ష చేస్తున్నరు

- సంక్షేమాన్ని పట్టించుకోకుంటే కాంగ్రెస్‌కు ప్రజలే శిక్ష వేస్తారు
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 15 : రైతు దీక్ష చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సీపీఐ నాయకురాలు కప్పల లింగమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లింగమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో నాలుగింటిని అమలు చేసిందని, ఎన్నికల కోడ్ మూలంగా మరో రెండు హామీల అమలు కొంత ఆలస్యమవుతుందని అన్నారు. సాగు నీరు లేక ఎండిన పొలాలు, అకాల వర్షాలకు దెబ్బగిన పంటలకు ఎకరానికి రూ.10వేల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమం పట్టించుకోకుంటే ప్రజలే కాంగ్రెస్‌కు శిక్ష వేస్తారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కమ్యూనిస్టులు బలపర్చిన కూటమిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు బూర వెంకటేశ్వర్లు, నెల్లికంటి సత్యం, సృజన, మల్లీశ్వరి, రాంబాబు, అశోక్‌కుమార్, కేవీఎల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేట సిటీ : అగ్ని ప్రమాదాలపై సీఎంఆర్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 15 : అగ్ని ప్రమాదాల పట్ల షాపింగ్ మాల్స్ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, అగ్ని ప్రమాదాలు వస్తే ఎలా నివారించాలో సిబ్బందికి అవగాహన కల్పించాల్సిన అవసరముందని అగ్నిమాపక శాఖ జమిందార్ శంకర్ అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా సూర్యాపేట పట్టణంలోని సీఎంఆర్, విశాల్‌మార్ట్‌తోపాటు పలు షాపింగ్ మాల్స్, ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపింగ్ మాల్స్, ఆసుపత్రిల్లో ఆర్‌సీసీ, కాంక్రీట్ శ్లాబులను మాత్రమే నిర్మించాలన్నారు. అవసరమైన ప్రదేశాల్లో ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సెల్లార్లలో ఆటోమెటిక్ స్ప్రింక్లర్‌ను ఉపయోగించాలన్నారు. పాఠశాలలు, ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు క్షేమంగా తప్పించుకునేలా సరైన ప్రణాళికలు రచించి అందరికీ తెలిసేలా తగు ప్రదేశాల్లో ఉంచాలని పేర్కొన్నారు. షాపింగ్ మాల్స్‌లో ఐఎస్ఐ మార్కు కలిగిన ఎలక్ట్రికల్ సామగ్రిని మాత్రమే వాడాలన్నారు. ఆసుపత్రులు, స్కూల్‌లో బయటకు వెళ్లే మార్గాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్‌మన్ ప్రవీణ్‌కుమార్, రాకేశ్, నగేశ్, సత్యనారాయణ, ఎస్‌కే యాకూబ్ పాల్గొన్నారు.

మైహోంలో అగ్నిమాపక వారోత్సవాలు

మేళ్లచెర్వు : వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మైహోం ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు సూచించారు. పరిశ్రమ ఆవరణలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల అవగాహన కరపత్రాలను అన్ని విభాగాల అధిపతులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరిశ్రమ జీఎం నాగేశ్వర్‌రావు, సేఫ్టీ హెడ్ సూర్యనారాయణ, ఫైర్ ఆఫీసర్ లక్ష్మయ్య, సెక్యూరిటీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

18న బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమేశ్‌గౌడ్

అర్వపల్లి, ఏప్రిల్ 15 : మండలంలో ఈ నెల 18న జరిగే బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18న ఉదయం యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ బిక్కు, పార్టీ నాయకులు ఎల్లం రాజు, గోసు విజయ్‌కుమార్, అరిగె వెంకన్న, హరిప్రసాద్, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గరిడేపల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఓ వ్యక్తి జీవితం మీద విరక్తితో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన జాల శ్రీరాములు (48) రెండేండ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎంతకీ ఆరోగ్య సమస్య తీరకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న శ్రీరాములును కుటుంబ సభ్యులు గమనించి హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. శ్రీరాములుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈట సైదులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరిడేపల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని పానుగోడు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో వెలిదండ ఫీడర్ లైన్ల కింద చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున మంగళవారం ఉదయం 8నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రావిరాల నగేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కీత వారిగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లోని రాయినిగూడెం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా ఫీడర్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి : సీపీఐ

గరిడేపల్లి, ఏప్రిల్ 15 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎండల తీవ్రత బాగా ఉండడంతో భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

నూతనకల్, ఏప్రిల్ 15 : ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో సకల సౌకర్యాలు కల్పించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల సమస్యలను సోమవారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో టెంటు వేయించాలని, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికిల్ కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాణాల వెంకట్‌రెడ్డి, చిర్ర రాములు, లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

మేళ్లచెర్వు, ఏప్రిల్ 15 : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ నాగేంద్రబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని, కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటి, మల్లికార్జున్, సైదులు, ఉప్పలమ్మ పాల్గొన్నారు.

బీజేపీ మ్యానిఫెస్టో అబద్ధాల పుట్ట : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, ఏప్రిల్ 15 : బీజేపీ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టో అబద్ధాల పుట్ట అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని బీజేపీ ఇప్పుడు కొత్త వాగ్దానాలు చేయడం విడ్డూరంగా ఉన్నదన్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఎలాంటి హామీ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఢిల్లీ నగర వీధుల్లో రైతులను కాల్చి చంపిన మోదీ ప్రభుత్వానికి పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, నాయకులు లక్ష్మి, సింహాద్రి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, శ్రీను, వెంకట్ పాల్గొన్నారు.

అనంతారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతం చూస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- డీఏఓ శ్రీధర్‌రెడ్డి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 15 : కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనంతారం, సింగారెడ్డిపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కళ్లాల వద్దే తూర్పారబట్టి, ఆరబెట్టుకొని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. మరింత మంది హమాలీలను ఏర్పాటు చేసి వెంటవెంటనే ధాన్యం కాంటా వేసి మిల్లులకు తరలించాలని, సంబంధిత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో, జిల్లా వాట్సాప్ గ్రూప్‌లో పొందుపర్చాలని సూచించారు. అకాల వర్షాలు వస్తున్నందున సెంటర్ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఓ కృష్ణసందీప్, ఏఈఓ పుష్ప, సీఈఓ ఆలకుంట్ల సైదులు, సతీశ్, స్వరూప ఉన్నారు.

కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ లత

ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ లత

తుంగతుర్తి, ఏప్రిల్ 15 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి వెంటవెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. సెంటర్ నిర్వాహకులు 24గంటలు కొనుగోలు కేంద్రం వద్ద తప్పకుండా ఉండాలని ఆదేశించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనంతారం అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈఓ అశోక్

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను నాణ్యతగా చేయాలి

- డీఈఓ అశోక్

పెన్‌పహాడ్, ఏప్రిల్ 15 : ప్రభుత్వ విద్య బలోపేతం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన దిశగా రూపుదిద్దుకుంటున్న అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను నాణ్యతగా చేపట్టాలని డీఈఓ అశోక్ అన్నారు. మండలంలోని దుబ్బతండా, అనంతారం ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో చేపడుతున్న పనుల నాణ్యతపై ఆరా తీశారు. వచ్చే నెలలో లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలుగా పాఠశాలలు అవసరం ఉన్నందున పనులు ఏ మేర పూర్తి చేశారో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఇంజినీరింగ్ విభాగం, కమిటీ సూచించిన మేరకు పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంఈఓ నకిరేకంటి రవి, హెచ్ఎం జమాల్ షరీఫ్, శ్రీదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

'నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి'

నాగారం, ఏప్రిల్ 15 : కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని వ్యవసాయ విస్తరణాధికారి సాయిరాజ్ అన్నారు. మండలంలోని నాగారం, పసునూరు, పస్తాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సోమవారం ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. తేమ శాతం 17 వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట స్వరూప, మహేశ్, శ్రీను, వెంకన్న, నరేశ్, వీరస్వామి ఉన్నారు.

వడదెబ్బ లక్షణాలు, జాగ్రత్తలపై అవగాహన

ఐకేపీ కేంద్రంలో హమాలీలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ చరణ్

అర్వపల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని కొమ్మాల ఐకేపీ ఆధ్వర్యంలో వడదెబ్బ లక్షణాలు, జాగ్రత్తలపై ఉపాధి హామీ కార్మికులు, హమాలీలకు మండల వై